నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, బుధవారం 24 ఏప్రిల్ 2024 | SURYAPET

ఐదో రోజు 9 నామినేషన్లు

నీలగిరి, ఏప్రిల్ 23 : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఐదో రోజు మంగళవారం ఎనిమిది మంది అభ్యర్థులు తొమ్మిది సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. వీరిలో బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి రెండు సెట్లు, ఎస్జేపీ తరపున సుంకరి లింగయ్య, మరో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందనకు అందజేశారు. స్వతంత్రులుగా అఖిల్ సంపంగి, రేళ్ల పెద్ద నరసింహారావు, సుంకరి రమేశ్, అబ్దుల్ మాలిక్, కిన్నెర యాదయ్య, పాలిశెట్టి వెంకటేశ్వర్లు నామినేషన్లు వేశారు.

ఓటు అడిగే హక్కు ఒక్క కేసీఆర్‌కే..

- రేవంత్‌రెడ్డి రేపు జిల్లాకు వచ్చి సాగర్ నీటిపై సమాధానం చెప్పాలి
- ఫ్లోరైడ్ పీడిత జిల్లాను ధాన్యాగారంగా మార్చిన ఘనత కేసీఆర్‌దే.
- రేవంత్‌రెడ్డి తన పదవిని కాపాడుకునేందుకు మోదీతో కుమ్మక్కు
- రైతులకు ఇస్తామన్న బోనస్ రూ.500 వ్యాపారులకు ఇస్తున్నారు
- నేటి కేసీఆర్ బస్సుయాత్రకు పెద్ద ఎత్తున తరలిరావాలి
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల నామినేషన్ కార్యక్రమంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

- రైతులందరికీ కాంగ్రెస్ రైతుబంధు ఇచ్చినట్లు నిరూపిస్తే ఎన్నికల నుంచి తప్పుకొంటాం.. లేకపోతే మీరు తప్పుకొంటారా?
- సాగర్ నీటిపై ఇరిగేషన్ సెక్రటరీ లేఖకు సమాధానం చెప్పాలి

నల్లగొండ ర్యాలీలో అభివాదం చేస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, నమస్కరిస్తున్న బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, పక్కన మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నేతలు

నీలగిరి, ఏప్రిల్ 23 : రాష్ట్రంలోని రైతులందరికీ రైతుబంధు ఇచ్చినట్లు నిరూపిస్తే తమ అభ్యర్థిని పోటీ నుంచి తప్పిస్తామని, నిరూపించకపోతే జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పి మీ అభ్యర్థిని తప్పిస్తారా? అని కాంగ్రెస్ నాయకులకు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం నల్లగొండ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా లక్ష్మి గార్డెన్స్ నుంచి క్లాక్‌టవర్, డీఈఓ కార్యాలయం మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ వెనుక ఓపెన్ టాప్ జీపులో అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితోపాటు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఇతర ముఖ్య నేతలంతా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమీపంలో జరిగిన సభలో జగదీశ్‌రెడ్డి ప్రసంగిస్తూ.. ఎన్నికలకు ముందు తాము రైతుబంధు వేస్తామని చెప్తే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి దాన్ని నిలిపివేయించారన్నారు. ఎన్నికల తరువాత ఎకరాకు 10 వేలు కాదు 15 వేలు ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదన్నారు. రైతుబంధు డబ్బులు 10 వేల కోట్లను కాంట్రాక్టర్లకు చెల్లించి కమీషన్‌ల రూపంలో జేబులు నింపుకొని ఢిల్లీకి కప్పం కట్టారని ఆరోపించారు. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదని, దీనిపై సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు ఒక్కొక్క మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. అన్నదాతను కాంగ్రెస్ నిలువునా మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో వంద రోజుల్లో 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టండి అని సీఎం రేవంత్, రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతా అని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారని, వారినే చెప్పుతో కొట్టేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. గడిచిన ఐదేండ్లలో ఎన్ని వ్యవసాయ పంపు సెట్లు కాలిపోయాయి, నాలుగు నెలల్లో ఎన్ని కాలిపోయాయో లెక్క తీద్దామని కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. పూటకో మాట మార్చే పార్టీ కాంగ్రెస్ అని ప్రజలకు అర్థమైందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. 60 ఏండ్లు నాశనం చేసిన జిల్లాను పదేండ్లలో కేసీఆర్ సస్యశ్యామలం చేసి 3 లక్షల మెట్రిక్ టన్నుల దిగుమతి ఉన్న ధాన్యాన్ని 40 లక్షలకు పెంచారని తెలిపారు. ఫ్లోరైడ్ పీడిత జిల్లాను ధాన్యాగారంగా మార్చిన చరిత్ర కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. నాగార్జునసాగర్‌లో 508 ఫీట్ల లెవల్‌లో నీరు ఉన్నప్పుడు కూడా ఎడమ కాల్వకు నీళ్లిచ్చామని, ఇప్పుడు 516 ఫీట్లు ఉన్నప్పటికీ జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు ఉండి కూడా నీరు ఇవ్వలేక పోయారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు కాకముందే ఇద్దరు మంత్రులు జిల్లాలో ఉండి మూడున్నర లక్షల ఎకరాలను ఎండబెట్టినందుకు ఓటు వేయాలా? అన్ని ప్రశ్నించారు. డిసెంబర్ 9న ఆరు గ్యారెంటీలు, 13 పథకాలు, 420 హామీలంటూ కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కేసీఆర్ తీసుకొచ్చిన అన్ని పథకాలను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రజలకు చేసిందేమీ లేక సీఎం రేవంత్ బూతులు తిడుతూ, అబద్ధాలు ఆడుతూ, కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. నేడో, రేపో సీఎం రేవంత్‌రెడ్డి పదవి పోతే నరేంద్ర మోదీ మద్దతుతో అధికారం నిలుపుకొనేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. నరేంద్ర మోదీ ప్రథమ శిష్యుడే రేవంత్‌రెడ్డి అని, ఆయనను అనుసరించే పాలన సాగిస్తానని చెబుతున్నారని అన్నారు. తెలంగాణను నాశనం చేసిన చంద్రబాబు, వైఎస్ఆర్ వారసుడు లిల్లీపుట్ రేవంత్ అని ఎద్దేవా చేశారు. ఏ మొహం పెట్టుకొని కేసీఆర్ నల్లగొండ జిల్లాకు వస్తాడని మంత్రి కోమటిరెడ్డి అనడం సిగ్గు చేటన్నారు. ఫ్లోరిన్ మహమ్మారిని తరిమికొట్టి జిల్లాను సస్యశ్యామం చేసిన కేసీఆర్‌కే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్‌ను ప్రజలు తన్ని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని వాళ్ల స్పందన చూస్తే అర్థమవుతుందన్నారు. ఈ ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండాయే అని, బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు తథ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ సూర్యాపేట, నల్లగొండ జిల్లాల అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్, తిప్పన విజయసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు ఇస్తాపత్ రామచంద్ర నాయక్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నల్లమోతు సిద్ధార్థ, మారిపెద్ది శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, కటికం సత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.

నల్లగొండ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, చిత్రంలో జడ్పీచైర్మన్ బంద నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు

నల్లగొండలో కంచర్ల నామినేషన్ ర్యాలీకి పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం

నీలగిరి గులాబీమయం

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి నామినేషన్ సందర్భంగా భారీ బైక్ ర్యాలీ
- లక్ష్మి గార్డెన్స్ నుంచి కలెక్టరేట్ వరకు జనసందోహం
- మండుటెండలోనూ ఉత్సాహంతో కదం తొక్కిన బీఆర్ఎస్ శ్రేణులు
- రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేసిన కృష్ణారెడ్డి

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 23 : నల్లగొండ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి నామినేషన్ కార్యక్రమం మంగళశారం అట్టహాసంగా సాగింది. నియోజకవర్గం నలుమూలల నుంచి ఉదయం నుంచే తరలివచ్చిన గులాబీ సైన్యంతో నల్లగొండలో భారీ సందడి నెలకొంది. ఎటుచూసినా గులాబీ జెండాలు చేతబట్టి బైక్‌లపై కార్యకర్తలు తరలిరావడం కనిపించింది. ముందే నిర్దేశించిన విధంగా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు హైదరాబాద్ రోడ్డులోని లక్ష్మి గార్డెన్స్ ఆవరణకు చేరుకుకున్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు భారీ బైక్ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేసేందుకు పార్టీ ముఖ్యులతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి బయల్దేరారు. ప్రచార రథంపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు అభ్యర్థి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, తిప్పన విజయసింహారెడ్డి, రాష్ట్ర నాయకుడు రాంచందర్‌నాయక్ పట్టణ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. వీరికి ముందు బైక్‌ర్యాలీలో కొద్దిదూరం వెళ్లాక నోముల భగత్‌కుమార్ బుల్లెట్ నడపగా వెనుకాల కంచర్ల భూపాల్‌రెడ్డి కూర్చుని కార్యకర్తలను ఉత్సాహపరుస్తూ ముందుకు సాగారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా కార్యకర్తలు ర్యాలీలో కదం తొక్కారు. డీజే పాటలకు స్టెప్పులు వేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా ముందుకు సాగారు. లక్ష్మి గార్డెన్స్ నుంచి ఎన్‌జీ కాలేజ్, క్లాక్‌టవర్ సెంటర్, డీఈఓ ఆఫీసు మీదుగా బైక్‌ర్యాలీ కలెక్టరేట్ వరకు సాగింది. బీఆర్ఎస్ బైక్ ర్యాలీతో పట్టణం గులాబీమయంగా మారింది.

రెండు సెట్ల నామినేషన్ల దాఖలు..

బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ ర్యాలీకి ముందుగా ఒక సెట్ నామినేషన్ వేశారు. జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు చకిలం అనిల్‌కుమార్, కటికం సత్తయ్యగౌడ్, మామిడి పిచ్చయ్యతో కలిసి కంచర్ల కృష్ణారెడ్డి తన తొలిసెట్ నామినేషన్ దాఖలు చేశారు. ర్యాలీ అనంతరం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, బొల్లం మల్లయ్యయాదవ్‌తో కంచర్ల కృష్ణారెడ్డి మరో సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. అంతకు ముందు తన స్వగ్రామం చిట్యాల మండలం ఉరుమడ్లలో రామలింగేశ్వర స్వామి ఆలయంలో కంచర్ల కృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. తన తల్లి కౌసల్యకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకుని నల్లగొండలో నామినేషన్ వేసేందుకు వచ్చారు.

నల్లగొండ వీటీ కాలనీలోని ఆలయంలోనూ నామినేషన్ పత్రాలతో కంచర్ల సోదరులు ప్రత్యేక పూజలు చేసి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కటికం సత్తయ్యగౌడ్, రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, కరీంపాషాతోపాటు నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నాయకులు ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేసీఆర్ పోరుబాట

- నేడు జిల్లాలో బీఆర్ఎస్ అధినేత బస్సు యాత్ర
- సాయంత్రం 5:30 గంటలకు మిర్యాలగూడలో ప్రారంభం
- రాత్రి 7గంటలకు సూర్యాపేటలోని కర్నల్ సంతోష్‌కుమార్ చౌరస్తా నుంచి పోస్టాఫీస్ చౌరస్తా వరకు భారీ రోడ్ షో
- పోస్టాఫీస్ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్న కేసీఆర్
- రాత్రికి సూర్యాపేటలోనే బస
- రేపు భువనగిరిలో రోడ్‌షో
- ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఉమ్మడి జిల్లా ప్రజలు
- దారి పొడవునా ఘన స్వాగతానికి బీఆర్ఎస్ శ్రేణుల సన్నద్ధం
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్రకు ఉమ్మడి జిల్లా పరిధిలో సర్వం సిద్ధమైంది. బుధవారం సాయంత్రం మిర్యాలగూడ, రాత్రి సూర్యాపేటలో, గురువారం సాయంత్రం భువనగిరిలో కేసీఆర్ బస్సు యాత్ర కొనసాగనున్నది. అందుకోసం మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు కలిసి ఏర్పాట్లు పూర్తి చేశారు. కేసీఆర్ బస్సుయాత్ర సాగే రూట్‌లో పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల వేళ తలపెట్టిన బస్సుయాత్రకు నల్లగొండ జిల్లా వేదిక కావడంతో రాజకీయంగా అందరి దృష్టి దీనిపై కేంద్రీకృతమైంది.

కాంగ్రెస్ నాలుగున్నర నెలల మోసపూరిత పాలనను ఎండగట్టి ప్రజలను చైతన్యం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తలపెట్టిన బస్సుయాత్ర బుధవారం నల్లగొండ జిల్లాను నుంచి మొదలుకానున్నది. వచ్చే నెల 11వరకు లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా అన్ని నియోజకవర్గాలను కలుపుతూ బస్సుయాత్ర సాగనున్నది. ఈ బస్సుయాత్రకు తొలి వేదికగా నల్లగొండ జిల్లా నిలువనున్నది. పార్టీ వర్గాలు తెలిపిన ప్రకారం.. నేడు మధ్యాహ్నం ఒంటిగంటకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ నుంచి కేసీఆర్ బయల్దేరనున్నారు. బస్సుయాత్ర ఉప్పల్, ఎల్‌బీనగర్ మీదుగా జిల్లాలోకి ప్రవేశించనున్నది. చౌటుప్పల్ వద్ద పార్టీ శ్రేణులు కేసీఆర్ బస్సు యాత్రకు ఘనస్వాగతం పలికేందుకు సిద్ధమయ్యాయి. ఆ తర్వాత చిట్యాల, నార్కట్‌పల్లిల్లోనూ పార్టీ శ్రేణుల స్వాగతంతో నల్లగొండ మీదుగా సాయంత్రం 5:30 గంటలకు మిర్యాలగూడకు చేరుకోనున్నది. మార్గమధ్యంలో మర్రిగూడ బైపాస్, తిప్పర్తి, వేములపల్లిల్లో బస్సు యాత్రకు స్వాగతం పలుకనున్నారు. మిర్యాలగూడ పట్టణంలోకి సాగర్ రోడ్డులోని ఫ్లైఓవర్ కిందుగా బస్టాండ్ వరకు చేరుకోనున్నది. అక్కడి నుంచి మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా కేసీఆర్ బస్సు యాత్రను రాజీవ్ చౌక్ వద్దకు తోడ్కొని వెళ్లనున్నాయి. అక్కడ ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించనున్నారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో..

మిర్యాలగూడ నుంచి కేసీఆర్ బస్సుయాత్ర సూర్యాపేటకు వెళ్లనున్నది. సాయంత్రం 6:15గంటలకు బయల్దేరి వేములపల్లి, తిప్పర్తి, నకిరేకల్ బైపాస్, కేతేపల్లి మీదుగా సూర్యాపేటకు చేరుకుంటుంది. రాత్రి 7గంటలకు సూర్యాపేటలోని కర్నల్ సంతోష్‌కుమార్ చౌరస్తా నుంచి పోస్టాఫీస్ చౌరస్తా వరకు భారీ రోడ్ షో కొనసాగనున్నది. పోస్టాఫీస్ చౌరస్తాలో కేసీఆర్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రాత్రి సూర్యాపేటలోని జగదీశ్‌రెడ్డి నివాసంలో కేసీఆర్ బస చేస్తారు. గురువారం సాయంత్రం వరకు జిల్లా పార్టీ ముఖ్యులతో కేసీఆర్ సమావేశం అవుతారని సమాచారం. జిల్లాలో పరిస్థితి, ఎన్నికల ప్రచారం, ప్రచార ఏజెండా తదితర అంశాలపై దిశా నిర్దేశం చేస్తారని తెలిసింది. అనంతరం సాయంత్రం 5 గంటలకు సూర్యాపేట నుంచి బస్సుయాత్ర భువనగిరికి బయల్దేరి వెళ్తుంది. భువనగిరి పట్టణంలో సాయంత్రం ఏడు గంటలకు భారీ రోడ్‌షోలో కేసీఆర్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌కు కేసీఆర్ చేరుకోనున్నారు. కాగా, ఉమ్మడి జిల్లా పరిధిలో కేసీఆర్ బస్సుయాత్రకు సంబంధించిన ఏర్పాట్లను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, అభ్యర్థులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలను సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు కేసీఆర్ బస్సు యాత్రకు ఉమ్మడి జిల్లా ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించేలా కార్యాచరణ చేపట్టారు. కేసీఆర్ జిల్లా పర్యటనకు పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలిరావచ్చేలా చర్యలు చేపట్టారు. కేసీఆర్‌తోనే తెలంగాణ ప్రజల హక్కులు కాపాడబడతాయని, రాష్ట్రం సురక్షితంగా ఉంటుందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ఎండగట్టడానికి కేసీఆర్ బస్సుయాత్రగా బయల్దేరుతారని, ప్రజలంతా భారీగా తరలిరావాలని ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్, పక్కన మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

భువనగిరి ఖిలాపై ఎగిరేది గులాబీ జెండానే

- లక్ష మెజార్టీతో విజయం మనదే
- 25న మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయండి
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

రాజాపేట, ఏప్రిల్ 23 : బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రైతుల కండ్లల్లో ఎనలేని ఆనంద వెల్లివిరిసిందని, కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో సాగునీళ్లు లేక రైతుల కండ్లల్లోంచి కన్నీళ్లు వస్తున్నాయని భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. మంగళవారం రాజాపేట మండల కేంద్రంలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. కాంగ్రెస్ అంటనే కరువుకు మారుపేరని, నాలుగు నెలల్లోనే గత పదేండ్లలో ఎప్పుడూ లేని కరువు తాండవిస్తుండడంతో సాగు, తాగు నీటి కోసం ప్రజలు విలవిల్లాడుతున్నారన్నారు. అబద్ధాలకు కేరాఫ్ రేవంత్‌రెడ్డి అని, స్థాయిని మరిచి మాట్లాడుతున్న సీఎంకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. తనను ఆశీర్వదిస్తే మీ సేవకుడిగా పనిచేస్తూ ప్రజల తరపున పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతానన్నారు. లక్ష మెజార్టీతో విజయం తనదేనని, భువనగిరి ఖిలాపై గులాబీ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 25 భువనగిరిలో సాయంత్రం 6 గంటలకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షోను బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గొల్లపల్లి రాంరెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నక్కిర్త కనకరాజు, సట్టు తిరుమలేశ్, రేగు సిద్ధులు, రామిండ్ల నరేందర్, మేక వెంకటేశ్వర్‌రెడ్డి, రాపోలు తిరుపతిరెడ్డి, విజయ్‌కుమార్, డొంకెన మహేందర్‌గౌడ్, కటకం స్వామి, ఎర్రగోకుల జశ్వంత్, ఉప్పలయ్యగౌడ్, కొన్యాల మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, బోనాల వెంకటేశ్ పాల్గొన్నారు.

పాఠశాలలకు వేసవి సెలవులు

- ఇంటిబాటన విద్యార్థులు

రామగిరి, ఏప్రిల్ 23 : 2023-24 పాఠశాల విద్యా సంవత్సరం మంగళవారం ముగిసింది. నేటి 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులను ప్రభుత్వ విద్యాశాఖ ప్రకటించడంతో విద్యార్థులు చివరి రోజు పాఠశాలల్లో తమ మిత్రులతో ఆనందంగా గడిపారు. ప్రోగ్రెస్ రిపోర్టులను తీసుకుని ఇంటిబాట పట్టారు. హాస్టళ్లలోని విద్యార్థులు తమ పెట్టెలను సర్దుకొని తల్లిదండ్రులతో కలిసి ఇండ్లకు చేరారు. విద్యార్థులతో ఆర్టీసీ బస్టాండ్లు కిక్కిరిశాయి. తిరిగి జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

ఎంజీయూ పరిధిలో 28 నుంచి..

రామగిరి, ఏప్రిల్ 23 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని యూజీ, పీజీ కళాశాలలకు ఈ నెల 28 నుంచి జూన్ 2 వరకు వేసవి సెలవులు ప్రకటించినట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొ.అల్వాల రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి కళాశాలలు జూన్ 3న ప్రారంభించాలని సూచించారు. అయితే విద్యార్థులకు నిర్వహించాల్సిన పరీక్షలు మాత్రం జరుగుతాయని పేర్కొన్నారు. అన్ని కళాశాలల యాజమన్యాలు విధిగా సెలవులను అమలు చేయాలని, లేని పక్షంలో వర్సిటీ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిగ్రీ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు చెల్లించాలి

- సీఓఈ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి

రామగిరి, ఏప్రిల్ 23 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని ఆయా డిగ్రీ కళాశాలల్లో సీబీసీఎస్ విధానంలో చదివే విద్యార్థులు ఈ నెల 27లోగా బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు చెల్లించాలని సీఓఈ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే డిగ్రీ 2,4,6 సెమిస్టర్స్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ 1,3,5 సెమిస్టర్స్ బ్యాక్‌లాగ్ విద్యార్థులు సైతం ఇదే గడువులోగా ఫీజులు చెల్లించాలని పేర్కొన్నారు. ఈ నెల 29లోగా రూ.100 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించే అవకాశం ఉందని తెలిపారు.

ఎన్నికల నిర్వహణలో ఎలక్టోరల్ అధికారులదే కీలక పాత్ర

- సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావ్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్, పక్కన ఎస్పీ రాహుల్ హెగ్డే

తుంగతుర్తి, ఏప్రిల్ 23 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ఎలక్టోరల్ అధికారులదే కీలక పాత్ర అని, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఎన్నికల సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలక్టోరల్ అధికారులు పోలీసు సిబ్బందితో కలిసి పోలింగ్ పూర్తయ్యాక ఈవీఎంలు గోదాముకు చేరేవరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసుకోవాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో చిన్న చిన్న సంఘటనలు చోటు చేసుకున్నాయని, అవి పునరావృతం కాకుండా జిల్లా, మండల, గ్రామీణ స్థాయి అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొనవద్దని సూచించారు. జిల్లాలో పోలీస్ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి బందోబస్తు పెంచాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లత, సూర్యాపేట డీఎస్పీ రవి, తాసీల్దార్ రమణారెడ్డి, ఆర్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, తాసీల్దార్లు, ఆర్ఓలు, వీఆర్ఓలు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.